హైదరాబాద్ వార్త



# రసవత్తరంగా "గ్రేటర్ "రాజకీయం

-జిహెచ్ఎంసిలో మళ్లీ "అవిశ్వాసం " చర్చ
-మేయర్, డిప్యూటీ మేయర్లపై పెట్టాలని బిఆర్ఎస్ ప్లాన్
-త్వరలో కెసిఆర్‌తో బిఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం
-ఇప్పటికే పలువురు బిజెపి,ఎంఐఎం కార్పొరేటర్లతో అంతర్గత చర్చలు




**హైదరాబాద్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) రాజకీయాలు ప్రస్తుతం రసవత్తరంగా మారాయి. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శోభన్ రెడ్డిలపై అవిశ్వాస తీర్మానం దాఖలవ్వొచ్చనే ఉహాగానాలు రాజుకుంటున్నాయి. పాలక మండలి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తమ స్ట్రాటజీలు రచిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లోనే బీఆర్ఎస్ ఒకీలక సమావేశం నిర్వహించాలని భావిస్తోంది. ఈమేరకు బుధవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలంగాణ భవన్‌లో జరిగిన ఓసమావేశంలో సంచన వ్యాఖ్యలు చేవారు. మేయర్, డిప్యూటీ మేయర్ అవిశ్వాసంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో ప్రత్యేక సమావేశం జరుగుతుందని తెలిపారు. నెంబర్ గేమ్ ఆధారంగా ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని వివరించారు. దీంతో మేయర్, డిప్యూటీమేయర్‌పై అవిశ్వాసం తప్పదనే చర్చనడుస్తుంది. నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే మొత్తం కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుల్లో (స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) సగం మంది నిర్ణీత ప్రొఫార్మాలో తీర్మానం చేసి సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి. ఆతర్వాత 15 రోజుల్లో సంతకాలు పెట్టిన ప్రజాప్రతినిధులు.. మిగతా సభ్యులతో కలిసి మీటింగ్ ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహిస్తారు. అందులో 98మంది సభ్యులు అశ్వాసానికి అనుకూలంగా ఉంటే అవిశ్వాసం నెగ్గినట్లు..అందులో ఒక్కరు తక్కువైనా అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటిస్తారు. అయితే జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 146 మంది కార్పొరేటర్లు, 50 మంది ఎక్స్‌అఫిసియో సభ్యులు మొత్తం 196 మంది ఉన్నారు. వీరిలో సగం అంటే 98 మంది సభ్యుల సంతకాలు అవసరం. అయితే బీఆర్ఎస్‌కు ప్రస్తుతం 42 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్‌అఫిషియో సభ్యులు కలిపి 71 మంది సభ్యుల బలం ఉంది. అవిశ్వాసం పెట్టాలంటే మరో 27 మంది సభ్యులు అవసరం. దీంతో ఎంఐఎం లేదా బీజేపీతో కలిస్తేనే అవిశ్వాసం పెట్టేందుకు వీలవుతుంది. అయితే గతంలో బిఆర్ఎస్‌కు మద్దతిచ్చిన ఎంఐఎం ఇప్పుడు కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో అవిశ్వాసం పెడితే బీఆర్ఎస్ ఎలాంటి వ్యూహం ఉంటుంది. వాళ్లు పెట్టే అవిశ్వాసానికి బిజెపి మద్దతుఇస్తుందా..లేదా తటస్థంగా ఉంటుందా అన్న చర్చ జోరుగా సాగుతుంది.

### బిఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచి అప్పటి ప్రభుత్వ ఆశీస్సులతోనే మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు దక్కించుకున్నారు. ఆసమయంలో ఎంఐఎం సైతం బిఆర్ఎస్‌కు అండగా నిలబడింది. ఆతర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీరిద్దరూ బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో తమ పార్టీ వల్ల పదవులు పొంది పార్టీ మారినా రాజీనామా చేయకుండా ఇంకా పదవుల్లో కొనసాగుతుండటాన్ని బీఆర్ఎస్ కార్పొరేటర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే కాంగ్రెస్ కార్పొరేటర్లు సైతం కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న తమకు దక్కని యోగం.. వారికి దక్కడంపై అంతర్గతంగా కలతచెందుతున్నారు. వీరు పార్టీలో చేరాక తమ ప్రాధాన్యం తగ్గిపోయిందనే తలంపులో ఉన్నారు. కాంగ్రెస్ తొలుత రెండు సీట్లు మాత్రమే గెలిచినప్పటికీ, లింగోజిగూడ బీజేపీ కార్పొరేటర్ ఆకుల రమేష్ గౌడ్ మృతితో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిచి ముగ్గురయ్యారు. తర్వాత పరిణామాలతో బీజేపీ నుంచి ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి 18 మంది చేరడంతో ఆ పార్టీ బలం 24కు పెరిగింది. ఎంఐఎం 44 స్థానాల్లో గెలవగా ఒకరు మరణించారు. ఇద్దరు రాజీనామాలు చేయడంతో ప్రస్తుతం 41 మంది ఉన్నారు. బీజేపీ 48 స్థానాల్లో గెలవగా ఆదిలోనే ఒకరు మరణించడంతో జరిగిన ఉప ఎన్నికలో ఓటమితో 47 మంది అయ్యారు. అనంతరం గుడిమల్కాపూర్ కార్పొరేటర్ మృతి చెందడం, కొందరు పార్టీలు మారడంతో ప్రస్తుత బలం 39గా ఉంది. బిఆర్ఎస్ వారు 56 సీట్లలో గెలిచారు. బీజేపీ నుంచి నలుగురు పార్టీలో చేరడంతో బలం 60కి పెరిగినప్పటికీ.. అనంతరం 18 మంది కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో ప్రస్తుతం 42 మంది ఉన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
-రూ. 80 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు శ్రీకారం...



**పంజగుట్ట, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** నగర వాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా రోడ్లు, పార్కులు, మౌలిక వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని జీహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు.బుధవారం ఆమె బంజారా హిల్స్ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 13, మినిస్టర్స్ క్వార్టర్స్ రోడ్డులో రూ. 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నగరంలోని ప్రధాన, అంతర్గత రోడ్లను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, వీటిని వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడమే లక్ష్యమని తెలిపారు. మౌలిక వనరుల అభివృద్ధిలో భాగంగా, ముఖ్యంగా రోడ్ల పటిష్ఠతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మేయర్ పేర్కొన్నారు.బంజారా హిల్స్ డివిజన్ లోని ప్రేమ్ నగర్ పార్కును జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో పునరుద్ధరించి బుధవారం మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా పార్కులను అభివృద్ధి చేయడం ముఖ్యమని, నగరంలోని వాకింగ్ ట్రాక్‌లు, గ్రీన్ స్పేస్‌లు, పార్క్‌లకు మరింత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పార్కులను వినియోగించుకోవాలని మేయర్ సూచించారు.నగరాభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడానికి కృషి చేస్తున్నామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఈ ఈ విజయ్ కుమార్స్ ఆయా విభాగాల అధికారులతో పాటు కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పూర్తయిన పనుల ప్రారంభానికి సిద్ధం చేయండి

-అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం, ప్రత్యేక అభివృద్ధి నిధులతో పూర్తిచేసిన పనుల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావే శ మందిరంలో సిడిపి, ఎస్ డి ఎఫ్, దిశా,పిఎం,స్వానిధి, పియం విశ్వకర్మ తదితర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని సమీక్షించారు. అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం, ప్రత్యేక అభివృ ద్ధి నిధులతో జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిపై శాఖల వారీగా సమీక్షిం చారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని, పూర్తయిన పనుల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకం కింద రుణాలు అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ పెట్టి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు అందించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక, ఎంపికైన లబ్ధిదారులకు త్వరిత గతిన రుణాల అందించాలన్నారు. త్వరలో దిశ సమావేశం ఏర్పాటు చేయనున్నందున పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ, బ్యాంకు లింకేజీ, హౌసింగ్ ద్వారా మందికి రుణాలు ఇచ్చారు. ఇంకా ఎంతమందికి ఇవ్వవలసి ఉంది అనే కచ్చితమైన సమాచారంతో సమావేశంలో పాల్గొనాలని కలెక్టర్ అధికారుల ఆదేశించారు. ఈ సమావేశంలోడిఆర్వో ఈ. వెంకటాచారి, యుసిడి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, ఎల్ డి ఎం సుబ్రహ్మణ్యం,అధికారులు జిఎం ఇండస్ట్రీ పవన్ కుమార్, డీఈవోఆర్ రోహిణి , డిఎంఅండ్ హెచ్ ఓడాక్టర్ వెంకట్, ప్రణాళికా శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సురేందర్, డిటి డబ్ల్యూ ఓ ఆర్ కోటజీ,డిఎండబ్ల్యూఓ ఇలియాజ్ అహ్మద్, ఈఈ షఫీమియా, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


కళాసీగూడాలో వివిధ శాఖల అధికారులతో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని.

**బేగంపేట ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**

కళాసీగూడాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం బేగంపేట డివిజన్ పరిధిలోని కళాసీగూడా మినర్వా కాంప్లెక్సు డౌన్‌లో వివిధ శాఖల అధికారులతో కల్సి పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెల్సుకున్నారు.ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని,కలుషిత తాగునీటి సరఫరా జరుగుతుందని,ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.అదే విధంగా డ్రైనేజీ ఓవర్ ఫ్లో జరిగి మురుగు నీరు రోడ్లపై ప్రవహించి ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు.స్పందించిన తలసాని తాగునీటి పైప్‌లైన్ లీక్ ఎక్కడ వుందో గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరగా వెంటనే రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే వెంట డీసీ సమ్మయ్య,కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, వాటర్ వర్క్స్ డీజీఎం శశాంక్,ఈఈ సుబ్రమణ్యం,టౌన్ ప్లానింగ్ అధికారి సుష్మిత,మాజీ కార్పోరేటర్ అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్,బస్తీ వాసులు ప్రమోద్,నర్సింగ్,బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్,నాయకులు టి.శ్రీహరి,నరేందర్‌రావు,శేఖర్,కిషోర్,ఆంజనేయులు,ఆరీఫ్ పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా

-హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ


మహాకుంభమేళాలో స్నానమాచరిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం మాఘపూర్ణిమ పురస్కరించుకుని ఆయన కుటుంబ సమేతంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో పాల్గొని, త్రివేణి సంగమంలో పవిత్రస్నానమాచరించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత మహాకుంభ సొంతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దత్తాత్రేయ కుమార్తె,బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

**సైఫాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూ నియన్ జెఎసి ఆరోపించింది. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో డ్రవర్ల సమస్యలను పరిష్కారిస్తామని ప్రక టించి, హామీ ఇచ్చిందని, హామీని నేరవేకుండానే 14 నెలలు గడిచాయని జెఎసి నాయకులు విమర్శించారు. బుధవారం సత్యనారాయణరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి నేతలు బి.వెంకటేష్ (ఎఐటియుసి), పి.శ్రీకాంత్ (సిఐటియు) తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లపై మొండి వైఖరిని విడనాడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న నారాయణగూడలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తామని హెచ్చరిం చారు. అలాగే ఈ నెల 24న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కారించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు నిరంజన్, ప్రవీణ్; రాంరెడ్డి, జంగయ్య, ఎస్.అశోక్ పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ నిర్మాణాలకు నిధులు కేటాయించండి

-సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**అత్తాపూర్ ఫిబ్రవరి12, ప్రభాతవార్త :** ఫ్లై ఓవర్ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని సిఎం రేవంత్ రెడ్డికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.బుధవారం జూబ్లిహిల్స్‌లో సిఎం రేవంత్ రెడ్డిని మర్యాపూర్వకంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.... నియోజకవర్గంలోని మైలార్‌దేవరపల్లి నుంచి దుర్గానగర్ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణంకు మరియు ఆరంఘర్ దగ్గర రెండు ఆర్‌యుబిల నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.259 కోట్ల కోట్లతో పనులు మంజూరు చేసింది కానీ నిధులు విడుదల చేయలేదని కావున మైలార్దేవరపల్లి నుంచి దుర్గా నగర్ వరకు ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్‌తో ఇక్కట్లు పడుతున్నారని ట్రాఫిక్ సమస్య చాలా ఇబ్బందికరంగా ఉందని వివరించడం జరిగిందని సమస్య తీవ్రతను తమ దృష్టిలో ఉంచుకొని నిధుల తొందరగా విడుదల చేయాలని సీఎంని కోరినట్లు తెలిపారు.ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించారని త్వరలో నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

## జైళ్ల శాఖ రాష్ట్ర స్థాయి వార్షిక స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


స్పోర్ట్స్ మీట్‌ను తిలకిస్తున్న హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్త , జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్ర

**సైదాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 7 రాష్ట్ర స్థాయి వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను చంచల్‌గూడలోని సికా పరేడ్ గ్రౌండ్‌లో హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్త బుధవారం జైళ్ల శాఖ డిజి సౌమ్యమిశ్రతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం శాఖ ప్రత్యేక కార్య దర్శి రవి గుప్త మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ సిబ్బందిలో శారీరక ధృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు సిబ్బంది మధ్య స్నేహ మధ్య స్నేహపూర్వక వాతారణాన్ని ఏర్పరచడానికి దోహదపడు తుందన్నారు. జైళ్ల శాఖలో ఉద్యగం ఎన్నో సవాళ్లతో కూడుకున్న దని, ఒత్తిడిని అధిగమించడానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. అంతకు ముందు సిబ్బంది గౌరవ వందనాన్ని ఆయన స్వీకరిం చారు. కాగా మూడు రోజుల పాటు స్పోర్ట్స్ మీట్ జరుగనుంది. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజిలు రాజేష్, మురళిబాబు, డిఐజిలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్‌లు శివకుమార్ గౌడ్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# సెలబ్రిటి క్రికెట్ లీగ్ మ్యాచ్‌లకు పటిష్ట భద్రత : సిపి సుధీర్‌బాబు



ఉప్పల్‌లో జరిగే సెలబ్రిటి క్రికెట్ లీగ్ మ్యాచ్ భద్రతా ఏర్పాట్ల గురించి వివరిస్తున్న రాచకొండ సిపి సుదీర్‌బాబు తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ క్రికెట్ స్టేడియంలో ఈనెల 14, 15 తేదిలలో జరిగే సెలబ్రిటి క్రికెట్ మ్యాచ్‌లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిపి సుధీర్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో సిసిఎల్ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్టేడియం అధికారులతోపాటు, జిహెచ్ఎంసి, విద్యుత్, రెవెన్యూ, ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, రిజర్వ్ పోలీసుల విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి సుధీర్‌బాబు మాట్లాడుతూ ఉప్పల్ స్టేడియంలో జరిగే క్రికెట్ మ్యాచ్‌లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వివిధ భాషల సినిమా తారలు పాల్గొంటున్నారని, ప్రేక్షకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అన్ని రకాల క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్టేడియంలో కూల్‌డ్రింక్స్, ఇతర ఆహార పదార్థాలను నిబంధనల మేరకు విక్రయించాలని సూచించారు. స్టేడియం పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాసుల జారీ విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి డిసిపి జి.నరసింహారెడ్డి, ఎస్‌ఓటి డిసిపి రమణారెడ్డి, ట్రాఫిక్ డిసిపి మల్లారెడ్డి, హెడ్‌క్వార్టర్ డిసిపి శ్యాం, మల్కాజిగిరి అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఎసిపి శ్రీనివాసారావు, మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి, సెలబ్రిటి క్రికెట్ లీగ్ పౌండర్ విష్ణువర్ధన్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

# కుంభమేళా ప్రమాద మృతదేహాల అప్పగింత



గాంధీ మార్చ్యూరి వద్ద కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగిస్తున్న అధికారులు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్తః** కుంభమేళాకు వెళ్లివస్తూ జభల్‌పూర్‌లో మరణించిన వారి మృతదేహాలను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతో గాంధీఆస్పత్రి ప్రాంగణంలో విషాదచాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాల రోదనలతో చూపరుల కంట కన్నీరు పెట్టించాయి. ఎంతో సంతోషంగా కుంభమేళాలకని బయలుదేరి అనంతలోకాలకు వెళ్లిన వారి మృతదేహాలను చూడడం కోసం వారి కుటుంబ సభ్యులు వచ్చి రోదిస్తుండడంతో వారిని నిలువరించడం ఎవరితరం కాలేదు. కాగా పోలీసులు, డిఎంహెచ్ఓ, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఏడు మృతదేహాలను అప్పగించారు. మృతుల కుటుంబ, బంధువుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం శోకసంద్రంలో మునిగిపోయింది. రెండు అంబులెన్స్‌లలో మృతదేహాలను గాంధీఆస్పత్రికి తీసుకువచ్చారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మృతుల కుటుంబ సభ్యుల అంత్యక్రియలు జరుగుతాయని అధికారులు తెలిపారు. ఉప్పల్, మారేడ్‌పల్లి, సైదాబాద్ మండల పరిధిలోని మృతుల డెడ్‌బాడీలను అధికారులు గాంధీ ఆస్పత్రిలో రిసీవ్ చేసుకున్నారు. బాధీత కుటుంబాలకు మృతదేహాలను వారికి చూపించారు. అరంతరం మృతదేహాలను వారివారి స్వస్థలాలకు తీసుకువెళ్లారు.ఔ

### రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది

- వి. హన్మంతరావు

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలను రప్పించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు జరిపారని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీఎంపీ వి. హన్మంతరావు తెలిపారు. మృతదేహాలను అప్పగించే సమయంలో ఆయాన బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం వారికి ఎక్స్‌గ్రేషియా ఎక్కువగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో శాంతి,పూర్ణాహుతి హోమం


శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో శాంతి,పూర్ణాహుతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం.

**బేగంపేట ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో బుధవారం కుంకుమార్చన చివరి రోజు సందర్భంగా శాంతిహోమం,పూర్ణాహుతి హోమం నిర్వహించారు.పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్లు సురిటి కామేశ్వర్,రామేశ్వర్‌లు,మాజీ ధర్మకర్తలు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.పూజ అనంతరం భక్తులకు ప్రసాదాల పంపిణీతో పాటు అన్నదానం నిర్వహించారు.

## మంచినీటి సమస్య పరిష్కరించాలి : సంతోషిరెడ్డి

**- అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్**



హైదర్షాకోట్‌లోని మాధవీనగర్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని జలమండలి జీఎం మహేందర్ నాయక్‌ను కోరుతున్న మాజీ కార్పొరేటర్ సంతోషిరెడ్డి.

**నార్సింగి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లోని పలు కాలనీల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ సంతోషి రాజిరెడ్డి జల మండలి అధికారులతో కలిసి పర్యటించింది. బుధవారం జల మండలి జీఎం మహేందర్ నాయక్‌తో కలిసి పలు కాలనీల్లో తిరిగారు. ఈ సందర్భంగా స్థానికులు మా ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే వచ్చే మూడు నెలలు ఎలా ఉండాలని, కనీసం వారానికి రెండు రోజులైనా మంచినీటిని సరఫరా చేయాలని కోరారు. అనంతరం సంతోషిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో వేసవిలో సైతం వారానికి మూడు రోజుల పాటు మంచినీటిని సరఫరా చేయించామని, తొలిసారిగా ఇప్పుడు నీటి సమస్య పెరుగుతుందని పేర్కొన్నారు. నీటి సమస్య పరిష్కారం కోసం జల మండలి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పై నుంచి నీటి క్వాంటిటీని పెంచుకొని సరఫరా చేస్తేనే ప్రజలకు నీటి సమస్య తీరుతుందని, లేదంటే ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని మాజీ కార్పొరేటర్ సంతోషిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం జల మండలి జీఎం మహేందర్ నాయక్ మాట్లాడుతూ ఈ వేసవిలో నీటి ఎద్దడి రాకుండా జల మండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ప్రణాళికబద్ధంగా నీటిని సరఫరా చేసే ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## మందకృష్ణ మాదిగకు శుభాకాంక్షలు తెలిపిన ఖానాపూర్ వాసులు



ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఖానాపూర్ ఎమ్మార్పీఎస్ నాయకుల దృశ్యం

**నార్సింగి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** మాదిగల ఆశాజ్యోతి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు గండిపేట మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గణేష్, ఖానాపూర్ అధ్యక్షులు పెద్దపులి శంకర్, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పెద్దపులి కిషన్‌లు మాట్లాడుతూ తరతరాలుగా మాదిగలకు జరుగుతున్న అన్యాయం ఆగిపోవాలంటే, మాదిగలు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో రాణించాలంటే రిజర్వేషన్లు ఒక్కటే మార్గమని మూడున్నర దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేశారన్నారు. అనేకమంది సీఎంలు, పిఎంలను, రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి మాదిగలకు జరుగుతున్న అన్యాయంను సరి చేసేందుకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారని తెలిపారు. చివరకు అంతిమంగా అనుకున్నది సాధించారని, అలాగే పద్మశ్రీ అవార్డును పొందిన సందర్భంగా మందకృష్ణ మాదిగను కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపామన్నారు. మాదిగల జాతిరత్నం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం చాలా సంతోషంను కలిగిస్తుందని పేర్కొన్నారు. మందకృష్ణకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో దేవదాస్, రాకేష్, బిక్షపతి, గోపాల్, రవీందర్, కృష్ణ, పోచయ్య ఉన్నారు.

## లక్ష్మీగణపతి దేవాలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:**
ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయం చైర్మన్ నర్సింగరావు, ఈవో లక్ష్మారెడ్డి వివరించారు. ఈ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయాలన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు నీటితో ఆలయాన్ని శుభ్రం చేసే పనిలో పడ్డారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని 26న ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఏకవారరుద్రాభిషేక మహోత్సవాలు, ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వర్ణపుష్పార్చనలు, సాయంత్రం ఆరు గంటలకు ఉమా మహేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం కన్నులపండువగా జరుగుతుందన్నారు. అదే రోజు రాత్రి తొమ్మిది గంటల నుంచి మహాన్యాసపూర్వక రుద్రాభిషేక మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ క్షీరలింగేశ్వరస్వామి వారి దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## సకాలంలో ఆస్తి పన్ను వసూలు చేయాలి : డిసి



**అత్తాపూర్ ఫిబ్రవరి12,ప్రభాతవార్త :** ఆస్తి పన్ను సకాలంలో వసూలు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్ పేర్కొన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూల్‌పై అధికారులత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ..... కార్యాచరణ ప్రకారం ముందుకెళ్లాలని ఆస్తిపన్ను వసూళ్లు పెంచాలని ,టీంల వారీగా ఉదయాన్నే సమయానికి క్షేత్రస్థాయికి చేరుకోవాలన్నారు. పన్ను వసూళ్ల వేగంగా విజయవంతంగా పూర్తి చేయాలంటే రోజువారి లక్ష్యం మేరకు పన్నులు వసూళ్ల చేయాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం..

**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మమత (17) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి మూసాపేట్ జనతా నగర్‌లో నివాసం ఉంటుంది. కాగ మంగళవారం మమత తన స్నేహితుడు నరేష్‌తో కలిసి టూవీలర్‌పై మూసాపేట్ నుండి కూకట్‌పల్లి వైపు వెళ్తుండగా మూసాపేట్ మెట్రో స్టేషన్ దగ్గరలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మమత, నరేష్ ఇద్దరికి స్వల్ప గాయాలతో రోడ్డుపై పడ్డారు. అనంతరం వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మమత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు మమత తల్లి ఎన్.కుమారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



చాచా నెహ్రూ స్టేడియంలో జరిగిన న్యాయవాదుల క్రికెట్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు వివిఎస్ శిరీష, జి.శిల్ప, పి.సుమలత, పి.హంసదుర్గా, రాధిక, ఎస్.ధనమ్మ తదితరులు

## దోమలు, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



బండ్లగూడ కార్పొరేషన్‌లో దోమలు, కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ అధ్యక్షులు నాగరాజు.

**నార్సింగి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో దోమలు, వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని బిఆర్ఎస్ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు కమీషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, సాయంత్రం ఆరు గంటలకు ఇళ్ల ముందు ఎవరైనా మాట్లాడుతున్నా వారి నోట్లోకి వెళ్లిపోతున్నాయని వివరించారు. వందలాది దోమలు ఇళ్లల్లోకి చొరబడి ప్రజలను నిద్రపోనివ్వడం లేదని, విష జ్వరాలతో ప్రజలను వణికిస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే వీధి కుక్కలు సైతం ప్రజలను భయపెడుతున్నాయని తెలిపారు. నడుచుకుంటూ వెళ్తున్నా, సైకిళ్లు, ద్విచక్రవహనాలపై వెళ్తున్న ప్రజలను లక్ష్యంగా చేసుకొని వీధి కుక్కలు కరుస్తున్నాయని, ప్రజల రక్తంను కళ్ల చూస్తున్నాయని పేర్కొన్నారు. సకాలంలో ర్యాబీస్ టీకాలు కూడా అందక కుక్కల కాటుకు గురైన ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. ర్యాబీస్ టీకా కోసం హైదరాబాద్‌లోని నారాయణగూడకు వెళ్లాల్సి వస్తుందన్నారు. అలాగే పాడైపోయిన హైమాస్ట్ లైట్లకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని, ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాలను కాపాడాలని కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరినట్లు నాగరాజు వివరించారు. వినతిపత్రంను చదివిన కమీషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ వీలైనంత త్వరగా దోమలు, వీధి కుక్కల సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారని నాగరాజు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బిఆర్ఎస్ నాయకులు రాములు యాదవ్, చందుగౌడ్, రవికుమార్, చంద్రారావ్, శాంతి నాయక్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సబ్సిడీ కోతలు

**-రాజ్యసభ సభ్యుడు, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి శివదాసన్**



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి శివదాసన్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** పేదల సంక్షేమానికి సబ్సిడీలను కోత విధించి కార్పొరేట్ అధిపతిలకు పన్నులను మినహాయింపు ఇచ్చారని, మధ్యతరగతి ప్రజలకు 12 లక్షల వరకు పన్ను మినహాయింపు ప్రచారం వట్టి మాటేనని రాజ్యసభ సభ్యులు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి శివదాసన్, విక్రమ్ సింగ్ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన 'కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ గ్రామీణ పేదలపై ప్రభావం' అనే అంశంపై సెమినార్ జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరై శివదాసన్, విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ నిత్యావసర సరుకులపై జీఎస్టి పన్నులు విధించి ముక్కు పిండి పేదల నుండి పనులు వసూలు చేస్తున్నారని, బడా కార్పొరేట్ యాజమాన్యాలకు పన్నులు మినహాయింపు ఇవ్వడంతో పాటు పారు బకాయిలు పేరుతో కోట్లాది రూపాయల బకాయిలను రద్దు చేశాని చేశారు. జీఎస్టీ పన్నుల నుండి నిత్యవసర సరుకులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచే గ్రామీణ ఉపాధి హామీ పనికి పెద్ద ఎత్తున నిధులు పెంచాలనే డిమాండ్ ను పట్టించుకోలేదన్నారు. పేదరికంలో అల్లాడుతున్న ప్రజలను ఆదుకోవడం కోసం ఎలాంటి చర్యలు ఈ బడ్జెట్లో లేవని, ఎల్పిజి ఉజ్వల స్కీం నిధులు కోత విధించారని అన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్, సబ్ ప్లాన్ నిధులను వారి జనాభా ఆధారంగా కేటాయించలేదని పేర్కొన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్ గురించి ఒక్క మాట కూడా చెప్పలేదని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పేదలకు కట్టించే ఇండ్ల స్లాబ్ ను పెంచాలనే డిమాండు ఉన్నాగాని బడ్జెట్లో ఒక్క పైసా కేటాయించలేదని అన్నారు. పట్టణ ప్రాంతాలకు గ్రామీణ ఉపాధి పనిని విస్తరింపచేయాలని అడుగుతున్న నిధులు కేటాయింపు లేదన్నారు. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున బకాయిలను పెట్టిందని చెప్పారు. ఈ సెమినార్లో అఖిలభారత నాయకులు వి. వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే లాజరస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బి పద్మ, రాళ్ల బండి శశిధర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్, జంగయ్య, మల్లేష్, డివైఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సంక్షేమమే "1104 యూనియన్ " ధ్యేయం

**-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు**



యూనియన్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సాయిబాబు, వెంకటేశ్వర్లు తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:**
విద్యుత్ రంగ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా 75 సంవత్సరాల క్రితం ఏర్పాటు అయిన 1104 యూనియన్... నేటికీ అదే ఒరవడితో పనిచేస్తున్నదని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సాయిబాబు తెలిపారు. ఈమేరకు బుధవారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్ లోని రాష్ట్ర కార్యాలయంలో 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా ఆయన ప్రసంగించారు. 1950, ఫిబ్రవరి 12వ తేదీ నుంచి విజయవంతంగా యూనియన్ కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయని సాయిబాబు తెలిపారు. ప్లాటినం జూబ్లీ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్, మండల, డివిజన్, జిల్లా, ట్రాన్స్ కో, జెన్ కో స్థాయిలో ఘనంగా జరుగుతున్నాయని అన్నారు. తమ యూనియన్ ఏ రాజకీయ పార్టీకి కూడా అనుబంధంగా లేదని, కేవలం కార్మికులు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే యూనియన్ పనిచేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. మెజారిటీ యూనియన్ గా కార్మికుల మన్ననలను పొందుతున్న 1104 యూనియన్... భవిష్యత్తులోనూ ఇదేవిధంగా కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలను రాష్ట్ర ప్రముఖులను ఆహ్వానించి అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ఈ వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఉద్యోగులు హాజరుకావాలని ఆయన కోరారు. ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా పదవీ విరమణ పొందిన యూనియన్ నాయకులను సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, డిస్కం, డివిజన్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోలీసు కస్టడీకి మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్

**-ప్రభాకర్ నేరాల చిట్టాపై విచారిస్తున్న గచ్చిబౌలి పోలీసులు**

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**
అరెస్టు చేసేందుకు వెళ్లిన పోలీసుల మీద కాల్పులు జరిపి సంచలనం సృష్టించిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్‌ను గచ్చిబౌలి పోలీసులు విచారణ కోసం కస్టడీకి తీసుకున్నారు. ప్రీజం పబ్ వద్ద జరిగిన కాల్పుల అనంతరం బత్తుల ప్రభాకర్‌ను మాదాపూర్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసి గచ్చిబౌలి పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. ప్రీజం పబ్ వద్ద ప్రభాకర్ జరిపిన కాల్పుల్లో సిసిఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి గాయపడగా, గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని బత్తుల ప్రభాకర్‌ను రిమాండ్‌కు తరలించారు. కాగా బత్తుల ప్రభాకర్ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉండడం, ప్రభాకర్ చేసిన నేరాల చిట్టా మీద మరింత సమాచారం కోసం విచారించేందుకు గచ్చిబౌలి పోలీసులు వారం రోజుల కస్టడీకి కోర్టులో దరఖాస్తు చేశారు. పోలీసు కస్టడీ పిటీషన్ మీద స్పందించిన కోర్టు బత్తుల ప్రభాకర్‌ను మూడు రోజుల కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గచ్చిబౌలి పోలీసులు బుధవారం ప్రభాకర్‌ను సంగారెడ్డి జైలు నుంచి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. మూడు రోజుల విచారణలో భాగంగా మొదటి రోజు బత్తుల ప్రభాకర్‌ను గచ్చిబౌలి పోలీసులు గత రెండు, మూడేళ్ల కాలంలో చేసిన నేరాల మీద ఎక్కువగా ప్రశ్నించినట్లు తెలుస్తుంది. దీంతో పాటు ప్రీజం పబ్ వద్ద అరెస్టుకు ముందు పోలీసుల మీద జరిపిన కాల్పుల్లో ఉపయోగించిన పిస్తోళ్ల కొనుగోలు, అందుకు సహకరించిన వారి వివరాల సేకరణపై ఎక్కువగా పోలీసులు దృష్టి పెట్టినట్లు సమాచా రం. కాగా పోలీసు విచారణలో బత్తుల ప్రభాకర్ తాను చేసినన నేరాల చిట్టాను పూసగుచ్చినట్లు వెల్లడిస్తూ పోలీసు లకు సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. విచారణలో భాగంగా తాను ఒక్కడినే చోరీలు ఎందుకు చేస్తానో ప్రభాకర్ వెల్ల డించాడని, ఎవ్వరినైనా కలుపుకొని చోరీలు చేస్తే పోలీసుల కు పట్టుబడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందుకో సమే తాను ఒక్కడినే చోరీలు, దోపిడీలకు పాల్పడుతానని ప్రభాకర్ చెప్పినట్లు తెలుస్తుంది. మరోవైపు చోరీ చేసిన సొమ్ముతో ఫారిన్ మద్యం సేవించడం, జల్సాలు చేయడం, పబ్బులకు తిరగడం, ఖరీదైన కార్లు కొనుగోలు చేయడం చేసే వాడని, పోలీసులకు పట్టుబడకుండా తాను నివాసం ఉండే ఇళ్లు, తిరిగే కార్లు మొత్తం స్నేహితుల పేరు మీదే అద్దెకు తీసుకోవడం, కొనుగోలు చేయడం చేసే వాడని సమాచారం. తన నేరాల గురించి స్నేహితులకు సైతం తెలియకుండా ప్రభాకర్ జాగ్రత్త పడేవాడని, ఎవ్వ రైనా స్నేహితుడికి విషయం తెలిస్తే భారీ మొత్తంలో డబ్బు ముట్టజెప్పి నోరు మూయించడంతో పాటు అక్కడి నుంచి బిచాణా ఎత్తివేసే వాడని విచారణలో పోలీసులకు తెలిపినట్లు సమాచారం. తాను నివాసం ఉంటున్న ఇంట్లో ఫర్నీచర్ మొత్తం నెలవారి అద్దెకు తీసుకువచ్చినట్లు ప్రభాకర్ వెల్లడించాడు. గత మూడేళ్లుగా బత్తుల ప్రభాకర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో చేసిన చోరీలపై

## పేద ప్రజలందరూ వైద్య సేవలు వినియోగించుకోవాలి

**-ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజల ప్రదర్శకులు సామ్ గుంటి**



**అత్తాపూర్ ఫిబ్రవరి12,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు సేవ చేయడం అలవాటుగా మార్చుకోవాలని ప్రముఖ అంతర్జాతీయ ఇంద్రజల ప్రదర్శకులు సామ్ గుంటి పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ ఉప్పరపల్లిలో చైతన్య రూరల్ డెవలప్మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఉప్పర్ పల్లి, హైదర్ గూడ, రాజేంద్రనగర్ ,చింతల్ మెట్, బుద్వేల్ ,అత్తాపూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు సుమారు 500 మంది ఉచిత హెల్త్ క్యాంప్ లో పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు చేసుకొని మందులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ శ్యామ్ బాబు మాట్లాడుతూ... కర్నూల్ జిల్లా కేంద్రంగా తమ సంస్థ విద్య వైద్య రంగాలలో అనేక సేవలను ఉచితంగా అందిస్తుదని వైద్యం ఎంతో భారంగా మారిన ఈ రోజులలో ఆర్థికంగా వెనుకబడిన సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఇటువంటి ఉచిత మెడికల్ క్యాంప్ లు నిర్వహించడం అభినందనీయం అని చైతన్య సొసైటీ సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ తమ సాటి వ్యక్తికి సహాయం చేయాలనే మంచి ఆలోచనను కలిగి వుండాలి అని వైద్య శిబిరానికి హాజరైన వారందరికీ ఆయన పిలుపు నిచ్చారు. పేద ప్రజలందరూ ఇటువంటి సేవలను వినియోగించుకొని తమ ఆరోగ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. ఈవైద్య శిబిర ప్రారంభోత్సవంలో క్యాంప్ కన్వీనర్ ల్యూకు శాంసన్ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి ,రాజకీయ నాయకులు పలుగుచెరువు మహేష్ ,రగడంపల్లి శ్రవణ్, సాయి, మాలిక్, రిటైర్డ్ పోలీసు ఆఫీసర్ గోల్కొండ యాదయ్య ,గోల్కొండ సంతోష్, చిన్న సురేష్ , భరత్, పలువురు స్థానిక రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## పార్కులను సుందరీకరణకు ప్రత్యేక చర్యలు : కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:**
గాంధీనగర్ డివిజన్‌లోని పార్కులను సుందరీకరించే కార్యక్రమాన్ని వేగవంతం చేయబోతున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. డివిజన్‌లోని పీపుల్స్ పార్కు, చిక్కడపల్లి లోని జనతా పార్కు, అష్టలక్ష్మీ పార్కులను బుధవారం హార్టికల్చర్, స్ట్రీట్ లైట్స్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. పార్కు ల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని, సుందరీకరణ తో పాటు అంధకారాన్ని తొలగించేందుకు అవసరం వున్న చోట కొత్తగా వీధిలైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పీపుల్స్ పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదు మేరకు పార్కులో వాటర్ ఫౌంటెన్, కూర్చునేందుకు నూతన బల్లల ఏర్పాటు, పిల్లలు ఆడుకునేందుకు కొన్ని ఆట పరికరాలను అమర్చాలని సూచించారు. చెత్తాచెదారం లేకుండా ప్రతిరోజూ చెత్తను తొలగించాలన్నారు. వాకర్స్ కోసం ప్రత్యేకమైన పాత్‌వే నిర్మించాలని అధికారులకు సూచనలు చేశారు. రానున్న వేసవి కాలంలో ప్రజలు సేద తీరేందుకు డివిజన్ లోని అన్ని పార్కు లను పచ్చదనం, మౌళిక వసతులతో నందనవనాలను తలపించే విధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, హార్టికల్చర్ అధికారి డి. ఈ ఆశిష్, జిహెచ్ఎంసి ఏఈ సంజయ్, స్ట్రీట్ లైట్స్ సూపర్వైజర్లు బాలు నాయక్, రాజు, బిజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, నాయకులు శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగ్ రావు, ఎం.ఉమేష్, ప్రకాష్ యాదవ్, ఆనంద్ రావు, సాయి కుమార్, నీరజ్, పీపుల్స్ పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగరాజు, సభ్యులు విద్యాసాగర్, శ్రీనివాస్ రావు, రజినీ కాంత్, ఆంజనేయులు, ప్రేమ్ కుమార్, వినోద్ జైన్, గణేష్, అఖిలేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

## రంజాన్ మాసానికి సిద్ధమవుతున్న పాతబస్తీ



రంజాన్ మాసం సందర్భంగా పలు రకాల జానిమాజ్‌లు

**చార్మినార్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** రంజాన్ మాసం దగ్గర పడుతుండటతో హైదరాబాద్ పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు రంజాన్ పండుగకు కావలసిన వస్త్రాలతో పాటు పలు రకాల వస్తువులను దేశంలోని పలు ప్రాంతాలు నుంచి అప్పుడే దిగుమతులు చేశారు. ముస్లింలకు రంజాన్ పెద్ద పండుగ కావటంతో పాతబస్తీలోని చార్మినార్, లాడ్‌బజార్, మదీనా, శాలిబండ, బహదూర్‌పుర, మలక్‌పేట్, సైదాబాద్, ఫలక్‌నుమా ప్రాంతాలలోని మార్కెట్లు ఎంతో రద్దీగా ఉంటాయి. హైదరాబాద్ పాతనగరంలో రంజాన్ నెలలో కోట్లాది రూపాయల వ్యాపారాలు జరుగుతుంటాయి. కొనుగోలు దారులతో పాతబస్తీలోని మార్కెట్లు రంజాన్ మాసంలో ఎంతో రద్దీగా ఉంటాయి. కాగా మార్చి నెల రెండవ తేదీ నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానున్నది. మదీనా సమీపంలోని మహ్మద్ క్యాప్ మార్ట్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జాని మాజ్‌లను విక్రయిస్తున్నట్లు ఎండి మహ్మద్ ఇలియాస్ బుఖారి వెల్లడించారు. రంజాన్ నెల దగ్గర పడుతుండటంతో వ్యాపారులు ఇప్పటికే రెడిమెడ్ దుస్తులు, వివిధ రకాల వస్త్రాలు, గాజులు, పప్పు దినుసులు, ఇతర ఆహార వస్తువులను దేశంలోని పలు ప్రాంతాలలోని వ్యాపార మార్కెట్లు నుంచి పెద్ద ఎత్తున కొనుగులు చేసి దిగుమతులు చేశారు. రంజాన్‌మాసంలో కోట్లాది రూపాయల హలీం అమ్మకాలు జరుగుతుంటాయి. పాతబస్తీలోని వ్యాపారులు తమ షాపులను అందంగా తీర్చిదిద్దుతున్నారు.

## మనువాద భావజాలంతో దళిత, ఆదివాసీలు విద్యకు దూరం





సభలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

**సైఫాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** విద్యా ద్వారానే మహిళల జీవితాల్లో వెలుగులు, సమూల మార్పులు వస్తాయని రాష్ట్ర విద్యా శాఖ కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి చెప్పారు. మనువాద భావజాలంతో స్త్రీలను, దళిత, ఆదివాసీ వర్గాలను విద్యకు గతంలో దూరంగా ఉంచారని ఆయన విచారం వ్యక్తం చేశారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో బుధవారం స్ప్రామాట్ కాంప్లెక్స్‌లో జరిగిన రాష్ట్ర మహాసభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలకు, బాలికలకు వారి హక్కులను సవ్యంగా అమలు చేయడానికి దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ప్రొఫెసర్ రమామెల్కొటి మాట్లాడుతూ మారుతున్న కాలంతోపాటు హింసాత్మాక ధోరణి పెరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సమాజానికి ఎంతో చేటని, ఇందుకు వ్యతిరేకంగా కృషి చేస్తున్న దళిత స్త్రీశక్తికి అభినందనలు చెప్పారు. గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ దళిత, ఆదివాసీ స్త్రీలపై హింస, మానసిక ఆరోగ్యం, వివిధ కోణాలపై జరుగుతున్న సంఘటనలకు వ్యతిరేకంగా తమ సంస్థ పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిక్కీ జాతీయ అధ్యక్షుడు నర్రా రవికుమార్, జిహెచ్ఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజా, సిద్ధోజీరావు, డా.సంధ్య, డాక్టర్ రాధికా తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలగాలి

**-బేగంపేట ఎసిపి గోపాల కృష్ణమూర్తి**



ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన వారిని సత్కరిస్తున్న బేగంపేట ఎసిపి గోపాల కృష్ణమూర్తి.

**బేగంపేట ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**
విధి నిర్వహణలో క్రమశిక్షణతో నడుచుకోవాలని బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి అన్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న శంకరరావు, ఏసుబాబు, లచ్చయ్య, బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనిల్ ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. వారంతా బుధవారం బేగంపేట ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ గోపాల కృష్ణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఏసీపీ వారిని ఘనంగా శాలువాలతో సత్కరించారు. మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఏసీపీ గోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అంకిత భావంతో పనిచేయాలని, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. అంకిత భావంతో పనిచేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజలతో మమేకమవుతూ వారి ఆదరణ, అభిమానాన్ని పొందాలని ఏసీపీ వారికి సూచించారు. అందరికీ ఆల్ ది బెస్ట్ తెలియజేసారు.

## సేవాలాల్ జయంతిని అధికారిక సెలవుగా ప్రకటించాలి

**-మంత్రి సీతక్కకు లంబాడీ ఐక్యవేదిక వినతి**



సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న రాజ్‌కుమార్ జాదవ్, ప్రవీణ్‌నాయక్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:**
లంబాడాల ఆరాధ్యదైవం "సంత్ సేవాలాల్ మహారాజ్" జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించాలని, లంబాడీలఐక్యవేదిక (లైవ్) డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.రాజ్ కుమార్ జాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోత్ ప్రవీణ్‌నాయక్‌ల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ ప్రాంగణంలో మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా మంత్రి స్పందిస్తూ ఈవిషయంపై వెంటనే సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సేవాలాల్ మహారాజ్ జయంతికి సెలవు ప్రకటించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రాజ్ కుమార్ జాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకులు బోడ భద్రు నాయక్ , లైవ్ ముఖ్య సమన్వయ కర్త గుగులోత్ రమేష్ జాదవ్, ఉద్యోగ విభాగం రాష్ట్ర కన్వీనర్ రాందాస్ నాయక్, రాష్ట్ర ఆర్గనైజర్ కన్వీనర్ గుగులోత్ ప్రవీణ్ నాయక్, రాజు నాయక్ పాల్గొన్నారు.

## ఫెక్సీల చించివేతపై కఠిన చర్యలు తీసుకోండి

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**
సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లో శ్రీశ్రీశ్రీపెద్దమ్మ పోచమ్మ తల్లి 20వ వార్శికోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫెక్సీలను ఉద్దేశపూర్వకంగా చించి తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీ నారాయణ డిమాండ్‌చేశారు. ఈమేరకు ఎస్.ఆర్. నాయక్ నగర్ నాయకులు పి.వి.బాస్కర్‌రెడ్డి, ఎస్.ఆర్.నాయక్ సంక్షేమసంఘ ఉపాధ్యక్షులు హరిబాబు యాదవ్‌లు ఫిర్యాదు చేశారు. 20వ వార్శికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన అమ్మవారి బ్యానర్లను ఈనెల తొమ్మిదవతేది అర్ధరాత్రి 12గంటలకు ఆటోలలో వచ్చి చాకులు, బ్లేడ్లతో కోసివేశారని ఫిర్యాదుచేశారు. గతంలో సైతం బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడం, దొంగిలించడం వంటి పనులను చేశారని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఫెక్సిలు చించివేసిన వారితో పాటు దానికి ప్రేరేపించిన వారిని సైతంగుర్తించి తగువిధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్‌చేవారు. దీనికి వెంటనే స్పందించిన జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ మాట్లాడుతూ బాధ్యులు ఎవరనేది విచారించి చర్యలుతీసుకుంటామని హామీఇచ్చారు.

## అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థుల ప్రదర్శన



కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

**నాచారం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** విశాఖపట్నంలో జరిగిన ప్రతిష్ఠాత్మక 2వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో నాచారం దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ కు చెందిన విద్యార్థులు అద్భుత ప్రదర్శన చేపట్టారు. బంగారు, వెండి, కాంస్య పథకాలను సాధించి అబ్బురపరిచారు. ఈ పోటీలలో భారతదేశం, నేపాల్, శ్రీలంక, చైనా, సింగపూర్, మలేషియా క్రీడాకారులు హాజరై పోటీపడ్డారు. నాచారానికి చెందిన దెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు షిహాన్ నల్లా శివ ప్రసాద్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో తమ ప్రతిభను, సాంకేతికతను ప్రదర్శించారు. ఎ. సారా, ఎన్.కీర్తి, డి.కార్తీక, ఎ. యువన్, కె. టియ, కె.చందన్, ఎన్. నితేష్, వి.సాకేత్, సాహితీ, అనిషా, ప్రణవ్ తమ ప్రతిభతో బంగారం, వెండి, కాంస్య పతకాలు సాధించారు. విజేతలకు పతకాలు, సర్టిఫికెట్ల ప్రదానంతో అవార్డు వేడుక గ్రాండ్గా ముగిసింది. ఛాంపియన్షిప్ సాధించడంలో మద్దతు ఇచ్చినందుకు కోచ్లు, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

## తయ్యబ రహబార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు

**చార్మినార్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతనగరంలోని తయ్యాబ రహబార్ ఫౌండేషన్, తయ్యాబ తస్నీమ్ మహిళా మండలి ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు తయ్యాబా తస్నీమ్ తెలిపారు. పాతబస్తీ శాలిబండలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తయ్యబ రెహబార్ ఫౌండేషన్ గత పది హేను సంవత్సరాలు నుంచి సామూహిక వివాహాలు జరుపుతున్నదని, అదే విధంగా పేద విద్యార్దులకు స్కూల్ నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను కూడ పంపిణి చేశామని తెలిపారు. డిసెంబరు నెలలో క్రిష్ణా జిల్లాలో జరిగిన దుస్తులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పాల్గొన్నారని, తయ్యాబ తస్నీమ్ మహిళ మండలి ఆధ్వర్యంలో మహిళలకు సంబంధించిన కేసులను పరిష్కారం చేశామని ఆమె తెలియజేశారు. తెలంగాణ, ఏపి రెండు రాష్ట్రాలలో కూడ పలు సామాజికి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. భవిష్యత్తులో పేద ప్రజల కోసం మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నామని తయ్యాబ రహబార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తయ్యబ తస్నీమ్ తెలియజేశారు.

### సరైన అవగాహనతో కుష్టు వ్యాధిని నిర్మూలించవచ్చు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**హుడా కాంప్లెక్స్, 12 ఫిబ్రవరి ప్రభాతవార్త:** సరైన అవగాహన ద్వారా కుష్టు వ్యాధిని నిర్మూలించ వచ్చని విశ్రాంత పారామెడికల్ ఆఫీసర్స్ అససియేషన్ గౌరవ అధ్యక్షుడు పురుషోత్తం రావు పేర్కొన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోషవాల సంధర్భంగా లయోలా పాటశాల ఆర్ధ్వర్యంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సరూర్ నగర్ లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పురుషోత్తం రావు బహుమతులను అందజేసారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతు జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు పక్షో స్తవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సంధర్భంగా పాటశాల, కళాశాల, మహిళమండలి, యువజన సంఘాల వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సద్గుణ చరీ, అధ్యక్షుడు సత్యనారాయణ, కళాశాల ఇన్ఛార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రఘు తదితరులు పాల్గొన్నారు

### బ్రాహ్మణపల్లి డిఆర్‌సిలో నైపుణ్య శిక్షణ కార్యక్రమం



**తుర్కయంజాల్ ఫిబ్రవరి12 ప్రభాతవార్త**

తుర్కయంజాల్ పురపాలక సంఘంపరిధిలో బ్రాహ్మణపల్లి డిఆర్‌సి 8 మున్సిపాలిటీలకు బుధవారం కంపోస్టింగ్ మరియు పొడి వనరుల కేంద్ర నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 8 మున్సిపాలిటీల నుంచి కమీషనర్లు, సానిటరీ ఇన్స్ పెక్టర్లు, పర్యావరణ ఇంజనీర్లు మరియు వార్డు అధికారులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా సిడిఓ హేమలత మాట్లాడుతూ.... కంపోస్టింగ్ పై నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ మరియు ఆధునిక పద్ధతులలో ఘన వ్యర్థాల నిర్వహణ, కంపోస్టింగ్ మరియు ఏ విధంగా చెత్తను సేకరించాలో అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని పలువురు మున్సిపాలిటీల అధికారులకు ఘన వ్యర్థ నిర్వహణలో మరియు కంపోస్టింగ్ పై నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పలువురు అధికారులు పేర్కొన్నారని పుర కమీషనర్ అమరెందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 మున్సిపాలిటీలైన వికారాబాద్, తాండూర్, పరిగి, సదాశివపేట్, నారాయణ కేడ్, ఆందోల్ జోగిపేట్, కోడంగల్, జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

### ఘనంగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు



జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకుంటున్న నాయకులు రామకృష్ణానంద్, మీర్జా సమద్ బేగ్, స్వామి గౌడ్, తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి12, ప్రభాతవార్త:** మలక్ పేట ఆస్మాన్ ఘడ్ లోని విద్యుత్ కార్యాలయంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు యూనియన్ ప్రాంతియ అధ్యక్షులు మీర్జా సమద్ బేగ్,ప్రాంతీయ కార్యదర్శి ఎం. స్వామి గౌడ్, ప్రాంతీయ అదనపు కార్యదర్శి ఎం. తిరుపతి, ప్రాంతీయ ఉపాధ్యక్షులు కందుకూరి రామకృష్ణానంద్ తదితరులు విచ్చేసి యూనియన్ జెండాను ఎగరవేసి కేక్ కట్ చేసి సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా యూనియన్ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్మికులు, సిబ్బందికి ఎల్లవేళలా అందుబాటులో ఉండే వారి అభ్యున్నతి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, హమేద్ అలీ, యాదగిరి, హరికృష్ణ, బాల్ రెడ్డి, కే. శ్రీనివాస్ రెడ్డి, దినేష్ కుమార్, మహేందర్, వినోద్, ఫ్రాంక్లిన్, సయ్యద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : కార్పొరేటర్



పారిశుధ్య సిబ్బందికి దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. జిఎ 2 కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీహాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బందికి కార్పొరేటర్ చేతుల మీదుగా నూతన దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొత్తకాపు అరుణ మాట్లాడుతూ మనం నిద్ర లేవకముందే పారిశుధ్య కార్మికులు తమ విధి నిర్వాహణలో నిమగ్నులవుతారని, వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు.కార్యక్రమంలో జిఎ 2 కాలనీ అధ్యక్షుడు కృష్ణ మురళి,రాజేశ్వర్‌రావు,సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

### కబ్జాలకు గురైన చెరువులను హైడ్రాతో విముక్తి కలిగిస్తాం : మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్

**సైదాబాద్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ నియోజకవర్గంలో కబ్జాలకు గురైన చెరువులు, కుంటలకు హైడ్రా సహాయంతో విముక్తి కలిగిస్తామని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని ఉదయ్‌నగర్, పద్మానగర్, సూర్యనగర్, సామ సరస్వతి కాలనీలో జడ్‌సి హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన వరదనీటి కాలువ, నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ నిర్ణీత సమయంలోపు బాక్స్ డ్రైయిన్ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎస్‌ఎన్‌డిపి పనులను పూర్తి చేసి వరదనీటి సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ఫంక్షన్‌హాల్ యాజమాన్యం నాలాను కబ్జాచేసి పార్కింగ్ కోసం చేపట్టిన నిర్మాణాలను పరిశీలించి వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసి సేవా ఇస్లావత్, ఇఇ కార్తీక్, టౌన్‌ప్లానింగ్ ఎసిపి ప్రతాప్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## హస్తినాపురం డివిజన్ పరిధిలో మధుయాష్కి గౌడ్ పాదయాత్ర



**వనస్థలిపురం. ఫిబ్రవరి12.ప్రభాతవార్త**

అర్ధాంతరంగా నిలిచిపోయిన వరద నీటి కాల్వ పనులను పూర్తిచేసే విధంగా కృషి చేస్తానని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్ కి గౌడ్ అన్నారు. హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తో కలిసి డివిజన్ పరిధిలోని వందన పూరి కాలనీలో అర్ధాంతరంగా నిలిచిపోయిన వరద నీటి కాల్వ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మధు యాష్ కి గౌడ్ మాట్లాడుతూ... చాపల చెరువును గత పాలకులు ఆక్రమించుకొని సామాన్య ప్రజలకు అమ్ముకున్నారని ఆ ప్రాంతంలో వసతులు లేక వర్షాలు వచ్చినప్పుడు కాలనీ మునిగిపోతుందని ఆయన ఆరోపించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. పనులను సక్రమంగా చేపట్టకపోవడం వల్ల వర్షం వచ్చిందంటే కాలనీవాసులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆ విషయం తెలుసుకొని ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. వెంటనే ఇట్టి సమస్యను ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వర్షాకాలం నాటికి వరదనీటి కాలువ పనులు పూర్తి అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అవసమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. దీంతోపాటు రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహిస్తూ ఆ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెడ్డి కాలనీలో జిహెచ్ఎంసి నిధులు 10 లక్షల 50 వేల తో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ను కార్పొరేటర్ ప్రారంభించగా ఆ ఓపెన్ జిమ్ ను మధు యాష్ కి గౌడ్ పరిశీలించారు. ప్రజలు ఆరోగ్య వంతంగా ఉండేందుకు ఓపెన్ జిమ్లు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి, హస్తినాపురం, చెంపపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి ,పిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, పాశం అశోక్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్ నేత, లింగాల కిషోర్ గౌడ్, బుద్దా సత్యనారాయణ, లత, మమత మల్లేష్ గౌడ్, శానీర్, సాయిరాం రెడ్డి ,విజయభాస్కర్ రెడ్డి దుర్గారెడ్డి ,రెడ్డి కాలనీ అధ్యక్షులు వెంకటరెడ్డి, రాజి రెడ్డి, తోకటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద్ బాగ్ వెంకన్న ఆలయానికి అభివృద్ధి కమిటీ ఏర్పాటు



**మల్కాజిగిరి ఫిబ్రవరి12,ప్రభాతవార్త :**

దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గం బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కె మోహన్ రెడ్డి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎబి రవీంద్ర రెడ్డి సమక్షంలో భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేం కుమార్ , వెంకటేష్ యాదవ్ , జి ఎన్ వి సతీష్ కుమార్ , జి డి సంపత్, గుండా నిరంజన్ ఆలయానికి విచ్చేశారు , ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సొనాది శంకర్ , గుడిదేన పద్మావతీ, జెక్సనీ శ్రీధర్ (రాజు) నిజంపురం, మోర పాండు శ్రీకాంత్, వెలమాజాల రవీందర్ రెడ్డి ,బొండ్లి కుమార్ సింగ్, వడ్ల ఏగొండ, పెండం అనిత, మన్య హేమంత్ కుమార్,వెంకట స్వామి,కొత్త సంజయ్ కుమార్, బందారు రత్నాకర్ రావు, పిట్ల గణేష్(కన్నా) ,లు కమిటీ సభ్యులు 14 మంది వీరి కాల పరిమితి ఒక సంవత్సర కాలం ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ది బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ జీఎన్వి సతీష్ కుమార్ బి కే శ్రీనివాస్ గుండా నిరంజన్ జీడి సంపత్ గౌడ్ మాజీ చైర్మన్లు ఉమేష్ సింగ్ రాందాస్ సంతోష్ ముదిరాజ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ జిత్ గౌడ్, వినోద్ యాదవ్ వైనాల ప్రవీణ్ మహేందర్ గౌడ్ శారద లక్ష్మీ నిర్మల ఇందిరా ప్రియదర్శిని, మహేందర్ గౌడ్, నాగేష్ గౌడ్ ఇస్త్రారి,యాదగిరి రాజు పాల్గొన్నారు

## మూసి పరిహార ప్రాంతంలో ఖాళీ చేసిన ఇళ్ల కూల్చివేతలు ప్రారంభం



మూసా నగర్ మూసి పరివాహక ప్రాంతంలో కూల్చివేత పనులను చేపడుతున్న దృశ్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

**మలక్ పేట ,ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** చాదర్ ఘాట్ మూసా నగర్ లోని మూసి పరివాహక ప్రాంతం వెంబడి ఉన్న ఖాళీ ఇళ్ల కూల్చివేత పనులు ప్రారంభం అయ్యాయి. మూసి సుందరీకరణ ప్రాజెక్టు పనులలో భాగంగా కొద్ది నెలల క్రితం చాదర్ ఘాట్ మూసా నగర్, శంకర్ నగర్ ప్రాంతాలలో సంబంధిత అధికారులు పర్యటించి సర్వే నిర్వహించి ఇళ్ళకు ఆర్ బిఎక్స్ అని మార్కింగ్ చేసిన సంగతి విధితమే. మార్కింగ్ చేసిన ఇళ్లలో నివసిస్తున్న నిర్వాసితులు పలువురు స్వచ్ఛందంగా వెళ్లడానికి అంగీకరించడంతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించి తరలించడం జరిగింది. నిర్వాసితులు ఇల్లు ఖాళీ చేయడంతో కొద్ది నెలలు అనంతరం బుధవారం చాదర్ ఘాట్ మూసా నగర్ లోని మూసి పరిహారక ప్రాంతం వెంబడి ఆర్ బిఎక్స్ అని మార్కింగ్ చేసిన ఖాళీగా ఉన్న ఇళ్ళ కూల్చి వేతల కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 20 ఇళ్ల వరకు కూల్చివేయడం జరిగిందని సిబ్బంది వివరించారు.

**మూసి పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందవద్దు : ఎమ్మెల్యే బలాల**

మూసి పరివాహక ప్రాంత ప్రజలు ఎటువంటి ఆందోళనలకు గురి కావద్దని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల విలేకరులతో మాట్లాడుతూ మూసి పరివాహక ప్రాంతంలో ఖాళీ చేసిన బాధితులకు చంచలగూడలో డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. మూసా నగర్ ,శంకర్ నగర్ తదితర ప్రాంతాలలో ఇల్లు ఖాళీ చేసిన వాటిని సంబంధిత అధికారులు, సిబ్బంది కూల్చివేసి ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. మూసి పరివాహక ప్రాంత ప్రజలు భయాందోళనకు గురి కావద్దని, బాధితులకు ప్రభుత్వపరంగా రావాల్సిన ఆర్థిక సహాయం, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

## ఇంటి పన్నుల తగ్గింపు కోసం సిడిఎంఎతో మాట్లాడతా : సబితా ఇంద్రారెడ్డి



సబితా ఇంద్రారెడ్డికి పెరిగిన ఇంటి పన్నుల గురించి వివరిస్తున్న కాలనీలవాసులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్న పెరిగిన ఇంటి పన్నుల తగ్గింపు విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరిస్తానని మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి హామీనిచ్చారు. జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని వివిధ కాలనీలవాసులు, కాలనీల సంఘాల ప్రతినిధులు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సబితారెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు కార్పొరేషన్‌లో ఇటీవల కాలంలో పెరిగిన ఇంటి పన్నుల విషయమై ఆమె దృష్టికి తీసుకొచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిహెచ్ఎంసి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ల కంటే మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు అధికంగా ఉన్నాయని వారు ఆమెకు వివరించారు. గతంలో ఎన్నడూ ఇంతగా పన్నులు పెరగలేదనీ ఈ ఆర్థిక సంవత్సరంలో మాత్రం అధికమయ్యాయని వారు వివరించారు. ఈ నేపథ్యంలో ఆర్థిక భారం వల్ల తాము పెరిగిన ఇంటి పన్నులను చెల్లించ లేని స్థితిలో ఉన్నామని వారు ఆమెతో మొరపెట్టుకున్నారు. ఈ మేరకు పన్నులు తగ్గే విధంగా చూడాలని వారు ముక్తకంఠంతో సబితారెడ్డిని కోరుతూ ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందుకు స్పందించిన ఆమె మాట్లాడుతూ పెరిగిన పన్నుల విషయమై సిడిఎంఎ (కమీషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్)తో మాట్లాడి పన్నులు తగ్గే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు నర్సింహారెడ్డి, వివిధ కాలనీ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గాలు, కాలనీలవాసులు, మహిళలతో పాటు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేకల రవీందర్‌రెడ్డి, దీప్‌లాల్ చౌహాన్, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు సిద్దాల అంజయ్య, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు పరిశుభ్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న సమన్వయకర్త డా.రాజశ్రీ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :**

ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిచ్విన్ ఈవెంట్స్, యాక్టివేషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సహకారంతో మహిళా సాధికారకత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినిలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త డా.ఎన్.రాజశ్రీ, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.రవిప్రసాద్, కె.గీత, డా.ఎస్.యమునారాణి, వి.అరుణ, పి.ధనలక్ష్మి, డా.వి.చంద్రకళ, వి.మమత,భాగ్యలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళలు బుతుచక్ర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థినీలు పాల్గొన్నారు.

### విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన స్కూల్ ప్రిన్సిపల్ అరెస్ట్

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఒక స్కూల్ కరస్పాండెంట్‌ను మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. బోడుప్పల్ వీరారెడ్డినగర్ లో ఉన్న శ్రీ బ్రిలియంట్ టెక్నో స్కూల్ కరస్పాండెంట్ రవీందర్‌రావు కొద్ది రోజుల క్రితం విద్యార్థులను తమ గదిలోకి పిలిపించుకుని వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. దీంతో పలు విద్యార్థి సంఘాలు స్కూల్ ముందు ఆందోళన నిర్వహించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రవీందర్‌రావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### చిలుకానగర్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** చిలుకానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా హేమనగర్ ఫీడర్ పరిధిలోని న్యూభవానీనగర్, మల్లయ్యనగర్,వాసవినగర్, సప్తగిరికాలనీ, రెడ్డికాలనీ, తిరుమల మెడోస్, తదితర ప్రాంతాలలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, అదేవిధంగా దేవేందర్‌నగర్ ఫీడర్ పరిధిలోని దేవేందర్‌నగర్, అంబేద్కర్‌కాలనీ, అన్నపూర్ణ కాలనీ, గణేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి పరామర్శ



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డిలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డిలను బుధవారం మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు పరామర్శించారు. బండారి వెంకట్‌రెడ్డి సతీమణి బండారి పద్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు బుధవారం వారి ఇంటికి చేరుకుని లక్ష్మారెడ్డి సోదరులను పరామర్శించారు.బండారి పద్మ మృతి బాధాకరమని,వారికుటుంబానికి ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు.

### తీర్థయాత్ర మృతుల కుటుబాలకు పరమేశ్వర్‌రెడ్డి పరామర్శ



తీర్థయాత్రలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జి ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** కుంభమేళాకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాచారంకు చెందిన కుటుంబాలను బుధవారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. కుంభమేళాకు వెళ్లి మృతి చెందిన సురకంటి రాంరెడ్డి, రాంపల్లి రవికుమార్, బోరంపేట సంతోష్, కల్వూరి రాజు, సోమవరం శశికాంత్ మృతదేహాలను పరమేశ్వర్ రెడ్డి పరామర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో అకాల మృత్యువాత పడడం తీవ్ర బాధాకరమన్నారు. వారికి తగు చేయూత అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, రాంరెడ్డి, అశ్వథామరెడ్డి, మహేష్‌యాదవ్, సంతోష్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, క్రాంతి, శ్రవణ్, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేష్, బారతమ్మ, లీల పాల్గొన్నారు.

### సర్వంగా సుందరంగా చిలుకానగర్ చౌరస్తా ముస్తాబు : బన్నాల ప్రవీణ్



చిలుకానగర్ చౌరస్తాలో స్వామి వివేకానందుడి విగ్రహం పనులు పరిశీలిస్తున్న బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** చిలుకానగర్ చౌరస్తాను సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నామని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిలుకానగర్ చౌరస్తాలో స్వామి వివేకానందుడి విగ్రహానికి పెయింటింగ్ వేయడంతోపాటు, కూలిపోయిన ప్రహరిగోడ, గేటు, మెట్ల నిర్మాణం పనులు పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద యువక్ సంఘం అధ్యక్షుడు ఈరెల్లి రవీందర్‌రెడ్డి అభ్యర్థన మేరకు జిహెచ్ఎంసి నుంచి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. చౌరస్తాను సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ఎ.కొండల్‌రెడ్డి, అశోక్‌చారి, సుందర్, సత్యనారాయణ, ప్రసాద్‌చారి తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కళ్యాణం



కార్యక్రమంలో పాల్గొన్న దేవ సురేఖ భాస్కర్ రెడ్డి దంపతులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:**

శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని అల్కాపురి కాలనీలోని శ్రీభ్రమరాంబిక మల్లిఖార్జునస్వామి దేవాలయం 19వ వార్షికోత్సవం, పౌర్ణమి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ క్రొవ్విడి వెంకట శ్రీనివాస్, ఆలయ అర్చకులు హరిహర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### గుండెపోటు పై అవగాహన సదస్సు



సమావేశంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎనోష్ కట్ట

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** గుండెపోటుకు సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సుప్రజా ఆసుపత్రి ఎండి డాక్టర్ ఎనోష్ కట్ట పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్ సీనియర్ సిటిజన్ ఫోరం భవనంలో నాగోల్ సుప్రజా ఆసుపత్రి ఆధ్వర్యంలో గుండెపోటుకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార కాలుష్యం, వాతావరణం కాలుష్యం కారణంగా అనేక ఆరోగ్యపరమైన సమస్యలు వస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జ్ఞాన కుమార్, డాక్టర్ వెంకట్ తేజ, డీజీఎం ఏవి. రావు, దుర్గాప్రసాద్, కార్తికేయన్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : శ్రీనివాస్



ప్రధాన అర్చకులు రంగరాజన్ ను పరామర్శిస్తున్న పీఠాధిపతులు శ్రీ శివ స్వామీజీ, శ్రీ రుద్ర యోగి స్వామీజీ జగిని శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట,ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్ పై దాడి జరగడంతో చిలుకూరు బాలాజీ దేవస్థానానికి శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీ శివ స్వామీజీ, శ్రీ రుద్రయోగి స్వామీజీ, బాబా పాండురంగ గురూజీ వెళ్లి రంగరాజన్ గారి పరామర్శించడం జరిగింది. అదేవిధంగా శ్రీ శైవ క్షేత్రం ప్రధాన కార్యదర్శి ఎల్ వి కుమార్, శ్రీ శైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ తెలంగాణ నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ అయిత హైమ, శ్రీ శైవ క్షేత్ర పీఠం తెలంగాణ మేనేజర్ వి. కోటేశ్వరరావు, వాసవి ఇంటర్నేషనల్ పరివార్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జగిని శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంచం శ్రీదేవి, వనిత శక్తి తెలంగాణ జాయింట్ సెక్రెటరీ దేవిక మరియు కమిటీ సభ్యులు పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా జెగినీ శ్రీనివాస్ మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకులు రంగరాజన్ పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

### బాలాపూర్‌లో సంతాన వేణుగోపాల స్వామి కళ్యాణం



బాలాపూర్ సంతాన వేణు గోపాల స్వామి కళ్యాణోత్సవ దృశ్యం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం శ్రీ సంతాన వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వందల సంవత్సరాల చరిత్ర గల ప్రాచీన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలోని కళ్యాణ మండపంలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ సత్యభామ సమేతుడైన సంతాన వేణుగోపాల స్వామి వారి తిరు కళ్యాణోత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. దేవస్థానం ఛైర్మన్ కొలను కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కళ్యాణ తంతును గ్రామస్తుల సమక్షంలో జరిపారు. ఈ కళ్యాణోత్సవంలో ఆంజనేయ చారి, కళ్లెం మల్లారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## మేయర్ సహకారంతో తిరుమలనగర్‌లో బిటి రోడ్డు



26వ డివిజన్ అల్మాస్‌గూడ తిరుమలనగర్‌లో నిర్మించిన బిటి రోడ్డు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్ తిరుమలనగర్‌లో అధ్వాన్నంగా ఉన్న రహదారులను మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సహకారంతో బిటి రోడ్లుగా నిర్మాణం జరిగి రోడ్ల సమస్యలు తీరాయని మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, రేవంత్ టీం సభ్యుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి వెల్లడించారు. దారుణంగా ఉన్న రహదారుల విషయమై తాము అప్పట్లో మేయర్ దృష్టికి తీసుకొస్తే స్పందించిన ఆమె బిటి రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన కాలనీల ప్రజల తరపున పారిజాతకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా 26వ డివిజన్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తాము కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

### శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు హఠాన్మరణం

**-నివాళులర్పించిన మైనంపల్లి హనుమంత రావు**



**మల్కాజిగిరి ఫిబ్రవరి12,ప్రభాతవార్త :** మల్కాజిగిరి సర్కిల్ పరిధి పని చేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్ శానిటేషన్ సూపర్వైజర్ నాగరాజు హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, సర్కిల్ ఉప కమిషనర్ జి.రాజు ,మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాగరాజు బౌతిక్కాయానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాగరాజు అందరితో కలిసి పని చేసే తత్వం ఉన్న ఉద్యోగి అని, ఏ పని చేప్పినా ఆ పని పూర్తి చేసి తిరిగి తెలియజేసే వారని ఆయన తెలిపారు. దహన సంస్కారాల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ.50వేలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, ఈ.ఈ.లక్ష్మణ్, మల్కాజిగిరి సర్కిల్ ఏఎంహెచ్ఓ మంజుల, డి.ఈ.ఈ.మహేష్, ప్రాజెక్టు అధికారి మల్లికార్జున్, ఏ.ఈలు, సి.ఓలు, ఎస్ఎఫ్ఏలు, శానిటేషన్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, రాము, నాయకులు లక్ష్మీ కాంతరెడ్డి, జి.ఎన్.వి.సతీష్ కుమార్, జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు హాజరై నివాళ్ళు అర్పించారు. పర్మనెంట్ చేయడం లేదనే వనోవేదనతోనే... నాగరాజు గత 25 ఏళ్ళుగా మున్సిపల్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. కాంట్రాక్ట క్రింద తాను పని చేస్తూ తనను పర్మనెంట్ చేయాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు సైతం పర్మనెంట్ చేయాలని అధికారులకు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు పట్టించుకోపోవడంతో మళ్ళి కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆయన్ను పర్మనెంట్ చేయమని చెప్పింది ఆయన అధికారులు ఆ ఫైల్‌ను ఏళ్ళ తరబడి వారి వద్ద పెట్టుకుంటుండడంతో ఆయన మనోవేదనకు గురై ఈ విధంగా పరిస్థితి తయ్యారైందని ఆయన కుటుంబ సభ్యులు చర్చించుకోవడం కనిపించింది. ప్రభుత్వం వారి కుటుంబాన్ని అదుకునే విధంగా ఉద్యోగం వారి కుటుంబ సభ్యులకు ఇచ్చే విధంగా చూడాలని పలువురు కోరారు.